నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 07, 2025 | www.navatelangana.com

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో సోమవారం లయన్స్ క్లబ్ మంచిర్యాల గౌతమి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 60 మంది పరీక్షలు చేసుకోగా వారిలో 20 మంది ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. లయన్స్ క్లబ్ రేకుర్తి ఐ హాస్పిటల్‌కు తరలించారు. రక్త పరీక్షలు నిర్వహించి మంగళవారం సర్జరీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉస్కెమల్ల పోషమల్లు, పోచమ్మ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల్ గౌతమి ప్రెసిడెంట్ ఉస్కెమల్ల రాజేంద్రప్రసాద్, మంజుల, డాక్టర్ ఉస్కెమల్ల సాయిరాం, డాక్టర్ సాంబమూర్తి, డాక్టర్ ప్రభాకర్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



శైలజ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-వాంకిడి

ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన మండలంలోని డాబా గ్రామానికి చెందిన శైలజ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆమె తమ్ముడికి ఉద్యోగంతో పాటు చదువుకోవడానికి అండగా ఉంటామన్నారు. ఆశ్రమ పాఠశాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. చాలా ఆశ్రమ పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు జరిగినా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ జడ్పిటిసి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్ కుమార్, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.



కలిసి పనిచేద్దాం..'స్థానికం'లో గెలుద్దాం..!

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీ కోసం కష్టపడే గెలుపు గుర్రాలకే టికెట్లు
- సంక్రాంతి పండగ తర్వాత నామినేటెడ్ పదవులు
- ఆదిలాబాద్‌కు త్వరలోనే విమానాశ్రయం మంజూరు
- టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్
- పదేండ్లలో కవితకు బీసీలు ఎందుకు గుర్తుకురాలేదని వ్యాఖ్య
- కేసీఆర్ కుటుంబం అబద్ధాల్లో నిష్ణాతులని మండిపాటు



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వేదికపై దీపాదాస్‌మున్షి, మంత్రి సీతక్క తదితరులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసిపోవాలి. కార్యకర్తల కష్టం ఫలితంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఎలాంటి విభేదాలకు చోటివ్వకూడదు. అందరూ కలిసి సాగుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి. రాష్ట్రంలో 90శాతం స్థానిక సంస్థలను మనమే గెలుచుకోవాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం మావలలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మంత్రి సీతక్క, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ దీపాదాస్ మున్షి, రాష్ట్ర ఇన్‌చార్జి విశ్వనాథన్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండె విఠల్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ తదితరులతో కలిసి మాట్లాడారు. కార్యకర్తలు పదేండ్ల పాటు శ్రమించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి పదవులు వస్తాయని..సంక్రాంతి పండగ తర్వాత నామినేటెడ్ పదవులు కేటాయింపు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయని.. రూ.2లక్షల రుణమాఫీకి పూర్తిగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే నాలుగేండ్లలో ప్రతి వాగ్దానాన్ని పూర్తిచేస్తామని.. ఇప్పటికే 56వేల ఉద్యోగాలిచ్చినట్లు గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లాకు త్వరలోనే విమానశ్రయం మంజూరుకు కృషిచేస్తామని.. ఈ జిల్లాలో ఏదైనా పరిశ్రమ నెలకొల్పాలని సీఎం భావిస్తున్నారని వివరించారు. ఆదిలాబాద్‌ను మెరుగైన జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కవితకు పదేండ్లలో బీసీలు ఇప్పుడే గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం అబద్ధాల్లో నిష్ణాతులని విమర్శించారు.

పనిచేసే వారికే పదవులు కేటాయిస్తాం

పార్టీలో కష్టపడి చేస్తూ అంకితభావం కలిగిన వారికే పదవులు దక్కుతాయని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పెద్ద కుటుంబం అందరూ ఒకే అభిప్రాయంతో ఉండకపోవచ్చు. నాయకులు సమన్వయం చేసుకొని నడిపించాలని సూచించారు. అందరూ పార్టీ కిందనే పనిచేయాలని తెలిపారు. ఇందిరమ్మ కమిటీల పేరిట లొల్లి పెట్టడం సరికాదని.. ఇండ్ల ఎంపికలో అర్హులు పేదలా కాదా.. అని మాత్రమే చూడాలని పార్టీలతో సంబంధం చూడకూడదని తెలిపారు. కేటీఆర్‌ను ఏసీబీ పిలుస్తోందని..అందుకే మేనిఫెస్టోలు కాల్చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే వాటిని కించపర్చేలా కేటీఆర్ మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.

అంబేద్కర్ పట్ల వ్యాఖ్యలు సరికాదు

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా పూజించే డా.బీఆర్.అంబేద్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపదాస్‌మున్షి అన్నారు. నిమ్న జాతులకు సమన్యాయం అందించిన రాజ్యాంగమన్నా..అంబేద్కర్ అన్నా బీజేపీ ఎప్పుడూ చిన్నచూపేనని వ్యాఖ్యానించారు. అంబేద్కర్‌పై అక్కసు వెళ్లగక్కడం పరిపాటిగా మారిందని ఇందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంవిధాన్ ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, వేణుగోపాలచారి, డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, నారాయణరావుపటేల్, ఆత్రం సక్కు, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, బోథ్,ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంఛార్జీలు ఆడె గజేందర్, శ్యాంనాయక్, ఆత్రం సుగుణక్క, నాయకులు గణేష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, జహీర్ రంజానీ, గుడిపెల్లి నగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీతక్క



గజమాలతో నాయకులకు సత్కారం



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదివాసుల సంక్షేమానికి పాటుపడతాం : ఏసీపీ రవికుమార్



నవతెలంగాణ - కాసిపేట

ఆదివాసుల పిల్లలు ఉన్నత విద్య నభ్యసించాలని, ఆదివాసీ కుటుంబాలకు పోలీసులు అండగా ఉండి సంక్షేమానికి పాటుపడుతామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత తిరుమలాపూర్ ఆదివాసీ గిరిజన గ్రామంలో దేవాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు - మీ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పోలీస్ అధికారులు ఆదివాసీ గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు మెరుగు పడ్డాయని, తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను చక్కగా చదివించుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గిరిజనుల శ్రేయస్సు కోసం పోలీస్ శాఖ ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటుందన్నారు. ఆదివాసీ గిరిజనుల పిల్లలు కూడా ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. ప్రభుత్వం అందించే వివిధ లబ్ధి కార్యక్రమాలను గిరిజనులకు చేర వేయడానికి పోలీస్ శాఖ ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తుందన్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని సంఘ విద్రోహ శక్తులు ప్రలోభాలకు గురి చేసి చెడు మార్గం వైపు నడిచేలా ప్రోత్సహిస్తారని, ప్రలోభాలకు లొంగకుండా మంచిని ఎంచుకుని సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ పర్యటన

నవతెలంగాణ-రెబ్బెన

డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వరరెడ్డి సోమవారం బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి ఖైరిగూడ ఓసీపీకి చేరుకొని ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో ఉత్పత్తి వివరాలను తెలుసుకున్నారు. గనిలోకి వెళ్లి పని స్థలాలు పరిశీలించారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుండి ఖైరిగూడ ఓసీ పని స్థలాలు వీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలపై అధికారులు, సిబ్బందికి మార్గ నిర్దేశం చేశారు. మార్చి 31లోగా ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. అనంతరం గోలేటిలోని భీమన్న మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. వృథా సామాగ్రితో పరికరాలు ఏర్పాటు చేయడాన్ని చూసి జీఎం శ్రీనివాస్, ఈపీ ఆపరేటర్ మురహరిరావును అభినందించారు. మైదానంలో ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారు. ఉద్యోగులు, గ్రామస్తులు జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ అధికారి ఎస్.ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలతో లబ్ధిదారులకు రూ.4.13లక్షల చెక్కులను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ, మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు గోలేటి స్వామి, ముత్యంపల్లి ప్రధాన కార్యదర్శి రేచవేణి ఓదెలు యాదవ్ పాల్గొన్నారు.

బుడగ జంగాల ఇండ్లకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్ మున్సిపాలిటీ వార్డు నెంబర్ 7లో ఉన్న బుడగ జంగాల కాలనీవాసులకు పట్టాలు అందజేయాలనీ ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయీం పాషా అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బుడగ జంగాలు 30 సంవత్సరాలుగా కరెంటు సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారని, డ్రైనేజీ సదుపాయం లేక రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో సమస్య మరింత జఠిలమవుతోందని తెలిపారు. ఇండ్లు సింగరేణి భూముల్లో ఉన్నందున జీవో నెంబర్ 76 ప్రకారం సర్వే జరిగిందన్నారు. సర్వే ప్రకారం ప్రభుత్వానికి డబ్బులు కట్టినప్పటికీ ఇప్పటి వరకు ఇండ్ల పట్టాలు రాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంపత్, తిరుపతి, చంద్రయ్య, జంపయ్య, కుమార్, ఆగయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. వేతనాలు పెంచడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. అలాగే ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. సానుకూలంగా స్పందిస్తూ మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బండ శ్రీను, అసోసియేట్ ప్రెసిడెంట్ రవి, ఉపాధ్యక్షులు జ్యోతి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, తోటరాజు, ఫెరోజ్, సంతోష్, విశాల్, శకుంతల, మమత పాల్గొన్నారు.

సీఎంకు ప్రజా పాలన తెలియదు : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయాలు మాత్రమే తెలుసని, ప్రజా పరిపాలన తెలియదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఉట్నూర్ నుండి రోడ్డు మార్గం ద్వారా జిల్లాలో ప్రవేశించిన ఎమ్మెల్సీకి బీఆర్ఎస్ నాయకులు జైనూర్ వద్ద ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. జైనూరు మండలంలోని దేవుగూడ గ్రామంలో నీలాబాయి కుటుంబాన్ని పరామర్శించి అక్కడి నుండి వాంకిడి మండలం చేరుకొని శైలజ కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడినుండి జిల్లా కేంద్రానికి చేరుకొని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు ఏవీ కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిలాబాద్‌కు తరలించారని, తాము జిల్లా ప్రజల ఆకాంక్ష నెరవేర్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ పోడు సాగుదారుల వద్ద నుండి భూములు లాక్కుంటే తాము అధికారంలో ఉన్నప్పుడు వారికి పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం చేతకానితనం వల్ల జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, దీనికి జైనూర్‌లో జరిగిన ఘటనే నిదర్శనమని తెలిపారు. నీలాబాయికి, శైలజ కుటుంబానికి రెండు లక్షలు చొప్పున అందజేస్తామని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యను చాయ్ తాగే లోపు పరిష్కరిస్తామని చెప్పిన సీఎం నెల రోజుల పాటు సమ్మె చేస్తున్నా స్పందించడం లేదెందుకని ప్రశ్నించారు. కేటీఆర్ మీద వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రశ్నించడం వల్లనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామని, ప్రభుత్వం మెడలు వంచైనా హామీలు నెరవేర్చేలా చూస్తామన్నారు. ప్రభుత్వం పెట్టే ఇబ్బందులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం ఎదుట భోజన కార్మికుల నిరసన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు సంవత్సరం గడిచినా అమలు చేయడం లేదన్నారు. ప్రతి కార్మికురాలికి పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దని, హెల్త్ కార్డులు, యూనిఫామ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షురాలు ఎండి రబియా, పొచ్చమ్మ, లక్ష్మీ మల్లవ్వ, అమృతమ్మ, ఆదిలక్ష్మి, లలిత, మల్లవ్వ, భూలక్ష్మి, శంకరమ్మ పాల్గొన్నారు.

టోకెన్ సమ్మెకు ఎస్టీపీపీ కార్మికులు సిద్ధం

నవతెలంగాణ-జైపూర్



కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సింగరేణి థర్మల్ ప్లాంట్ యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 18న హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో టోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధపడ్డారు. ఈ మేరకు ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి సోమవారం హెచ్ఎంఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఎస్టీపీపీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో ఏ మాత్రం చొరవ చూపడం లేదన్నారు. డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషన్ ఎదుట ఎన్నో మార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా యాజమాన్యం గౌర్హాజరవుతూ సమస్యల పరిష్కారంలో కాలాయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ యాజమాన్యంతో హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో అనేక పర్యాయాలు చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో టోకెన్ సమ్మె అనివార్యమైందని పేర్కొన్నారు. ఈ విషయమై గత అక్టోబర్ 21న కార్మికుల అభిప్రాయం కోసం పోస్టల్ బ్యాలెట్ నిర్వహించగా ఎస్టీపీపీ కార్మికులంతా సమ్మె చేపట్టాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు, ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు సాయికృష్ణారెడ్డి, చిప్పకుర్తి సంపత్, నర్సింహరెడ్డి, రిక్కుల నర్సింహరెడ్డి, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కేంద్రంలో ఇండక్షన్ ట్రైనింగ్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

వృత్తి శిక్షణ కేంద్రంలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీస్ (ఎక్స్‌టర్నల్ బ్యాచ్)కు ఇండక్షన్ ట్రైనింగ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం లభించడం అదృష్టమని, ఎక్స్‌టర్నల్ పరీక్షలలో ఉత్తీర్ణులై జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలుగా రావడం అభినందించదగిన విషయమని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, గనిలో రక్షణతో పని చేస్తూ బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. మైనింగ్ ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తూ గనిలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులకు తగిన సూచనలు ఇస్తూ, వ్యక్తిగత రక్షణతో పాటు ఉద్యోగుల రక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ జనవరి 6 నుండి 20 వరకు నిర్వహిస్తామన్నారు. ట్రైనింగ్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ కల్లూరి వెంకట రామారావు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని వినతి

కాసిపేట : మండలంలోని దేవాపూర్ గ్రామంలో నిర్వహించే బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆట్కపురం రమేశ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో బెల్ట్ షాపులపై ఎంపీవో సఫ్దర్ అలీకి వినతిపత్రం అందించారు. దేవాపూర్‌లో మొత్తం 120 బెల్ట్ షాపులున్నాయని, 24 గంటలు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మద్యం తాగి ఎక్కడ పడితే అక్కడ మూత్ర విసర్జన చేస్తున్నారని, దీంతో మహిళలు రోడ్లపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని వివరించారు. వెంటనే బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 07, 2025 | www.navatelangana.com

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా



వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు రంగు నాగరాజ్‌గౌడ్, కోడూరి సత్యనారాయణగౌడ్, బాలసాని నారాయణగౌడ్, జిల్లా నాయకులు జగదీష్‌గౌడ్, దినేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నిర్మల్ డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును సోమవారం సాయంత్రం ఆయన నివాసంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, బొకెను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాటీస్, నాయకులు కొండ శ్రీనివాస్, బురాజ్, గణేష్, అరవింద్, రవి ఉన్నారు.



పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల ఎంపీడీఓ కార్యాలయంలో, బట్టిసవర్గాం పరిధిలోని దుబ్బగూడలో మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రజలందరూ కూడా ఒకే మోడల్ ఇల్లు కట్టుకుంటే ఖర్చు గాని, ఇతర ఇబ్బందులు లేకుండా ఉంటుందన్న ఉద్యేశంతో జిల్లాలో మోడల్ ఇల్లు నిర్మించుకోవడం జరుగుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్నవాటిని పూర్తి చేస్తామని అన్నారు. రాబోయే కాలంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి పదంలో నడిపించేందుకు కృషి చేస్తామని అన్నారు. బట్టి సవర్గం పరిధిలోని దుబ్బగూడ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ అలం, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆదివాసులకు కరెంట్ సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుమురంభీం కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద ఆదివాసులకు గృహ జ్యోతి పథకం ద్వారా వెంటనే కరెంటు సౌకర్యం కల్పించి ఇంటి స్థలాలకు పట్టాలు, నీళ్ళ, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. సోమవారం జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో కుమురంభీం కాలనీలో ఆదివాసులు నివసిస్తున్నారన్నారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఇంద్ర, డివిజన్ ఉపాధ్యక్షులు గణపతి, రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు భుజంగ రావ్ ఉన్నారు.

తప్పిన ప్రమాదం - ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని బంగారుగూడ బ్రిడ్జి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రికి కుమార్తెకు గాయాలైనట్టు స్థానికులు తెలిపారు. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. బంగారిగూడ మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని, ఆమె తండ్రి రమేష్ గాయాలయ్యాయి. బంగారుగూడ వాగు నుంచి ఇసుక తీసుకొస్తున్న లారీ స్కూటీని ఢీ కొట్టింది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ స్కూటీని ఢీకొట్టాడు. స్కూటీపై ముగ్గురు ఉన్నట్టు తెలిపారు. కాగా ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్, సూపర్ స్పెషలిటీ, ఉట్నూర్, నిర్మల్ జిల్లా ప్రభుత్వాస్పత్రుల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రులలో ఓపి పెరిగిందన్నారు. బెడ్స్ పెరిగాయి కానీ కార్మికులను పెంచడం లేదన్నారు. తమరు దృష్టి సారించి కార్మికులను అన్ని ప్రభుత్వాస్పత్రులలో కార్మికులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రిమ్స్ కార్మికులు కన్నాల లక్ష్మి నర్సమ్మ ఉన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



నవతెలంగాణ-నేరడిగొండ

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌లకు సోమవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అడే గజేందర్ మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఆడే వసంత్. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

- **మంత్రి సీతక్క**



నవతెలంగాణ-ఆదిలాబాద్

రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ, ప్రమాదాల నివారణకు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీసీ రవీందర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను అందచేశారు. మంత్రితో పాటు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు ద్విచక్ర వాహనాలను నడిపి రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కల్పించారు. అదేవిధంగా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలతో పాటు ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అత్యాధునిక సాంకేతికత, సదుపాయాలతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. అనంతరం జైనథ్ సర్కిల్ పరిధిలో పోగొట్టుకున్న ఇరవై సెల్ ఫోన్‌లను సీఐఈఆర్ పోర్టల్ ద్వారా గుర్తించగా, వాటిని మంత్రి చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. వాహన చోదకులు ప్రయాణ సమయంలో స్వీయ నియంత్రణ పాటిస్తూ, ప్రమాదాల నివారణకు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతి నిత్యం పర్యవేక్షణ కొనసాగుతుందని వివరించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నెల రోజుల పాటు అవగాహనా కల్పిస్తున్నట్టు తెలిపారు. గుర్తించిన ప్రయివేటు పాఠశాలల్లో అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఇదిలా ఉంటే రిమ్స్ సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. ఆస్పత్రిలోని పలు వార్డులు, పరికరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మంత్రికి వివరించారు. అనంతరం అధికారులతో కలిసి కాంటీన్‌ను ప్రారంభించి, అక్కడి వంటకాల రుచులు చూశారు.

రెగ్యులర్ డీడబ్ల్యూఓను నియమించాలి

- **సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్**



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లాలో ఐసీడీఎస్‌కు రెగ్యులర్ డీడబ్ల్యూఓను నియమించి అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వాల్సిన ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు పెంచాలన్నారు. నిర్మల్ జిల్లాలో గత సంవత్సర కాలం నుంచి సెంటర్ రూ.1500 ఇవ్వాల్సి ఉండగా, రూ.500 ఇస్తున్నారన్నారు. పోపు సామాన్ మూడు నెలల నుంచి రావడం లేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు రిజిస్టర్లు ఇంకా అందించలేదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, పెరిగిన ఇంటి అద్దెలను చెల్లించాలాన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు పెంచాలన్నారు. అంగన్‌వాడీలో గత 30 ఏండ్లుగా పనులు చేస్తున్న ప్రభుత్వం గుర్తించక పోవడం దారుణమన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.1లక్ష ఇచ్చి వేతనంలో సగం పెన్షన్ రూపంలో నెలనెలా అందించాలన్నారు. ఈనెల 6 నుంచి 31 వరకు సెక్టార్ మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభలు ఫిబ్రవరి 6న జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలకు కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, గంగామణి, విజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత, నాయకులు సునీత, నర్సమ్మ, హేమలత, లావణ్య, రమ్య, భాగ్య పాల్గొన్నారు.

రైతులను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- **మాజీ ఎంపీ కవిత ధ్వజం**



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులకు రైతు భరోసా కింద ఏకరానికి రూ.15వేలు ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడేమో కోతలు విధిస్తూ, రూ.12వేలకు కుదించిందని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఓదార్పు యాత్రలో భాగంగా సోమవారం ఆమె కుమురంభీం జిల్లాకు వెళ్తూ మండలంలోని అమర వీరుల స్తూపం వద్ద ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు జల్, జంగల్, జమీన్ నినాదంతో తమ హక్కుల కోసం తమ ప్రాణాలు త్యాగం చేసిన వారిని స్మరించుకున్నారు. వారి త్యాగ ఫలితమే ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం కింద భూముల కు హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ప్రజల పక్షాన పోరాడే తమ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం కేసుల పేరిట వేధిస్తోందన్నారు. ఇప్పుడేమో తన అన్నయ్య కేటీఆర్‌కు కేసుల పేరిట భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్ని కేసులు చేసిన తమ పార్టీ భయపడేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. తాము చేసిన పోరాటాల ఫలితంగా రైతు భరోసాను ఇచ్చుటకు ప్రభుత్వం దిగి వచ్చిందని పేర్కొన్నారు. రైతుల హామీలను పరిష్కరించుటలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఎమ్మెల్సీ కవిత వెంట బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కరీంనగర్ మాజీ మున్సిపల్ చైర్మెన్ రవీందర్ సింగ్, ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, స్థానిక నాయకులు సోఫియాన్, ఆంజద్, మాజీ ఎంపీటీసీ ఆశ, మాజీ సర్పంచ్ జామున నాయక్ ఉన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్ : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. నిర్మల్ మండలం ముజేలి గ్రామానికి చెందిన ముత్యం తనకు గేదెల లోన్ మంజూరు చేయించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు, ఏపీఓ పీవీటీజీ మెస్రం మనోహర్, సీడీపీఓ ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీఓ ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో చోరీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో కార్యాలయంలో ఆదివారం రాత్రి రూ.43వేల నగదు చోరీ జరిగినట్లు సిబ్బంది తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల రైతులకు యూరియా, డీఏపీ, ఇతర మందులు విక్రయాలు జరిపిన నగదును సిబ్బంది కార్యాలయంలోనే చైర్మెన్ చాంబర్‌లోని టేబుల్ డెస్కులో ఎప్పటిలాగా పెట్టి ఇంటికి వెళ్లారు. కాగా సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది చైర్మెన్ ఛాంబర్ తలుపులకు వేసిన తాళం తొలగించి ఉండటంతో వెంటనే చైర్మెన్ సీఈఓకు సమాచారం అందించగా దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి ఫింగర్ ప్రింట్ నిపుణులతో పాటు క్రైమ్ బ్రాంచ్ సిబ్బంది వచ్చి దొంగతనం జరిగిన తీరును సిబ్బందిని, అడిగి తెలుసుకుని, చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ముఖాడే ఉత్తమ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ముఖాడే ఉత్తం, వైస్ చైర్మెన్‌గా సోయం మారుతీ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు 15 మంది పాలకవర్గ సభ్యులుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన చైర్మెన్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ 90 మంది లబ్దిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం జిల్లా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్, ఎంపీడీఓ కే.భాస్కర్, తహసీల్దార్ మెంగు ప్రవీణ్, మార్కెట్ కార్యదర్శి దేవన్న స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అయోడిన్‌పై కళా ప్రదర్శన



నవతెలంగాణ-ఇచ్చోడ

ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బోరిగామ గ్రామంలో అయోడిన్‌పై కళా ప్రదర్శన నిర్వహించారు. అయోడిన్ లోపం ద్వారా యుక్త వయస్సు మహిళల్లో పిల్లల్లో మందబుద్ధి శారీరక ఎదుగుదల లోపిస్తుందని, పాటలతో అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. గాయిటర్ థైరాయిడ్ వంటి రుగ్మతలు వస్తాయని, అందుకు గర్భవతులు, పాలిచ్చే తల్లులు, విద్యార్థులు, అయోడిన్ ఉన్న సి విటమిన్ ఫుడ్ చేపలు, రొయ్యలు, కూరగాయలు, పాలు, నాణ్యమైన పౌష్టికాహారం ప్రతినిత్యం తీసుకోవాలని పాట, మాట రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, శశిమాల, జాకీర్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు నెరవేర్చాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు, సంవత్సరానికి రైతుబంధు రూ.15వేల చొప్పున ఇస్తానని, ఇప్పుడు మాట తప్పి రూ.12వేలు ఇస్తానని అనడం సరి కాదన్నారు. రూ.4వేలు పెన్షన్ ఇస్తానని ఇప్పటివరకు పెన్షన్ల ఊసు లేదని అన్నారు, కళ్యాణ లక్ష్మి కింద రూ.లక్షతో పాటు బంగారం ఇస్తానన్నాడని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఇలా 6 గ్యారంటీలు హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జవహర్ లాల్, ఏపీఓ జాదవ్ సురేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ దినపత్రిక ప్రచురిస్తున్న వార్తలను అభినందించారు. ముందుగా నవతెలంగాణ దినపత్రిక అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అధికారులకు ప్రజలకు వారధిగా అంటూ సమస్యను తమ దృష్టికి తీసుకురావాలని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కోరారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీసీలు రేవయ్య, కిషన్, టీఈసీ సురేందర్, టీఏలు సాధిక్ అల్లి, జాదవ్ సచిన్, కైలాష్, జ్యోతి, లావణ్య, డీటీ బిర్షావ్, ఆర్ఐ సురేందర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

3

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

మంగళవారం | జనవరి 07, 2025 | www.navatelangana.com

టీఎంటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో సోమవారం తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్(టీఎంటీయూ) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈవో వెంకటేశ్వర స్వామి, టీఎంటీయూ రాష్ట్ర కార్యదర్శి సామల శ్రీవర్ధన్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ అందె నాగ మల్లయ్య చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, సత్యనారాయణ, గణేశ్, శంకర్, మోహన్, చైతన్య, స్రవంతి, సుష్మ, మాధురి, సంయుక్త, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-పెంచికల్ పేట్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సందర్భంగా ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందిస్తామని అన్నారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు ప్రణాళిక ప్రకారం చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద్రమౌళీ, మధునయ్య, కాంగ్రెస్ నాయకుడు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ, శంకర్‌గౌడ్, రాజు, చందు, నందు, మండల విద్యాధికారి రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు యాదగిరి పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం కుటోద గ్రామంలో భీమయ్యక్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద రూ.2.5లక్షలతో ఏర్పాటు చేసిన నీటి సరఫరా విద్యుత్ మోటార్‌ను ప్రారంభించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. విద్యపై దృష్టి సారించాలని యువకులకు సూచించారు. క్రీడలతో మానసిక ప్రశాంతత పాటు శారీరక దృఢత్వం పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, గిరిజన సంఘం నాయకులు, గ్రామస్తులు సిడాం శంకర్, తిరుపతి, జంగు, పావుగ, భీము, రాము, సోము, జైతు పాల్గొన్నారు.

కులగనణ ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలి



నవతెలంగాణ-దండేపల్లి

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగనణ ఆధారంగా స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్ కొల్లూరు రవి డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా ఒకే రిజర్వేషన్ ఉండటం వల్ల స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పొందలేక చాలా మంది ఆసక్తి ఉన్న నాయకులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వే ఆధారంగా జనాభాను పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ప్రధానంగా మహిళలకు రాజకీయ, ఆర్థికంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాలలో స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఒకటే రిజర్వేషన్ అమల్లో ఉందని, వాటిని మార్చేలా చూడాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు వివరాలను యువజన సంఘాల నాయకులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అక్కల సురేష్, సాయికుమార్, మెడపట్ల శ్రీనివాస్, జిల్లపెల్లి వినయ్ కుమార్, ఆవుల సురేష్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పది నెలల నుండి వేతనాలు పెండింగ్‌లో ఉన్న ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలకు వెంటనే వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్ కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎంలకు పది నెలల నుండి వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 24 గంటల పాటు స్థానికంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని కోరారు. లేనియెడల 15 రోజుల తర్వాత విధులు బహిష్కరించి సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరి, కృష్ణవేణి, సునీత, శ్రీదేవి, సుజాత, లలిత, సునీత, పంచపూల, మారుబాయి, బద్రుబాయి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం జరిగిన సాధారణ మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలో గల పలు వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎలక్ట్రిక్ పోల్స్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్స్ తరలింపుకు మున్సిపల్ నిధులు వెచ్చించేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. మార్కెట్‌లో గల వాటర్ ట్యాంక్‌ను తొలగించి ఆ స్థలాన్ని పార్కింగ్ కొరకు ఉపయోగించేందుకు, పట్టణంలోని రోడ్డుపై వెడల్పుగా ఉన్న గల పలు జంక్షన్‌లను కుదింపు, పోలీస్‌స్టేషన్ ముందు గల యూటర్న్ తొలగించడానికి కౌన్సిల్ తీర్మానించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాలను అభివృద్ధిలో ముందు స్థానంలో నిలుపుతానని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోతులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని చించోలి(బి) అర్బన్ పార్క్‌లో గల కోతుల పునరావాస, పునరుత్పత్తి నిరోధక కేంద్రంలో చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ ఆదేశాల మేరకు సోమవారం కోతుల బెడద నివారణ కోసం తిరిగి చర్యలు ప్రారంభించామని ఎఫ్ఆర్ఓ రామకృష్ణారావు తెలిపారు. రెండు రోజుల నుండి నిర్మల్ పట్టణంలో సుమారు 90కోతులను పట్టి వాటికి పశువైద్యాధికారి శ్రీకర్ రాజు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం వెసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ నాగినిబాను, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాజీర్ ఖాన్, అటవీ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వీడాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సెమినార్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'మతోన్మాదం-రాజ్యాంగ పరిరక్షణ' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి, దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసే కుట్రకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు. మతాల మధ్య విద్వేషాన్ని సృష్టించి, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్పొరేట్ శక్తులే అధిక ప్రయోజనం పొందుతున్నాయే తప్ప కార్మికులకు, రైతులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని అన్నారు. కేంద్రం అమలు చేసే నాలుగు కార్మిక కోడ్‌ల వల్ల కనీస వేతనం, ఉద్యోగ, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పనిదినాలు, కార్మిక యూనియన్‌ల హక్కులు అగమ్యగోచరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత ప్రాంతాలలో ఇప్పటికే ఎనిమిది గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిదినాలు అమలవుతున్నాయని అన్నారు. అంగన్‌వాడి, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, క్షేత్ర సహాయకులు, వీఓఏలు తదితర పథకాలలో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమదోపిడీకి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సెమినార్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మల్లీశ్వరి, ఆశా యూనియన్ జిల్లా నాయకురాలు పద్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు మాయ, బిల్డింగ్ యూనియన్ నాయకులు గౌస్, మధుతో పాటు అన్ని రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ సమర్థవంతంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల కార్మికుల నిర్మూలన, బాలల సంక్షేమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 11వ విడత కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్‌డీఓ లోకేశ్వర్‌రావుతో కలిసి బాలల సంక్షేమ కమిటీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 1 నుండి 31 వరకు జిల్లాలో చేపట్టే ఆపరేషన్ స్మైల్ 11వ విడత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా 14 సంవత్సరాల లోపు వయసు గల బాల బాలికలు ఎట్టి పరిస్థితులలో బాల కార్మికులుగా ఉండకూడదని, ఇటుకల తయారీ, ఇతర పరిశ్రమలు, హోటళ్ళు, వ్యవసాయ తదితర రంగాల్లో బాల కార్మికులను నియమించుకుంటే యజమానులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుండి ఇటుకలు, మట్టి పైపుల తయారీ పరిశ్రమలు, జిన్నింగ్ మిల్లులలో పని చేసేందుకు కుటుంబంతో వలస వస్తున్నందున వీరిలోని చిన్నపిల్లల చదువు కోసం అంగన్వాడీ కేంద్రాలు, సమీప పాఠశాలలకు విద్యార్థులను పంపించే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ పనులకు పంపించే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, బడి మానివేసిన, బడి వయసు గల పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసించే విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించాలని, చాలా కాలం నుండి గైర్హాజరు అయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎవరైన బాల కార్మికులు పనులలో ఉంటే చైల్డ్ కేర్ నెంబర్ 1098కు సమాచారం అందించి బాల కార్మిక వ్యవస్థ నియంత్రణలో సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు సజీవన్, బాలల సంరక్షణ అధికారి మహేష్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత

- ఎమ్మెల్సీ దండె విఠల్ ఉదార నిర్ణయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించేందుకు ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీన్ని సోమవారం నుండి నియోజకవర్గంలో అమలు చేశారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు)లో ఉదయం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షలు ముగిసేవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఎమ్మెల్సీ దండె విఠల్ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, 22వ వార్డు కౌన్సిలర్ లావణ్య శరత్ ముదిరాజ్, నాయకులు గజ్జల సురేష్, ఉపాధ్యాయులు అనీస్ అహ్మద్, కిషన్, రాజేశం, సుధారాణి పాల్గొన్నారు.



చింతగూడ పాఠశాలలో..

అదేవిధంగా కాగజ్‌నగర్ మండలం చింతగూడ జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు కూడా ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఎమ్మెల్సీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యమ్రంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె సుధాకర్, నాయకులు పొన్న రమేష్, ముజామిలుద్దీన్ హైమద్, నాగేందర్, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏఎంవిఐ విక్రమ్, ఎంఈఓ జయరాజ్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. రోడ్లపై నడిచే విద్యార్థులు, పాదాచారులు రోడ్డు దాటే సమయంలో ఇరువైపులా గమనించి రోడ్డు దాటాలని సూచించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడపకూడదని, తల్లిదండ్రులు కూడా వారికి వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సిబ్బంది రవి, ఉపాధ్యాయులు దినేష్ అహ్మద్, నారాయణ, హరీష్, వెంకటేష్, విగ్నేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన

మండల కేంద్రంలోని చత్రపతి శివాజీ చౌరస్తాలో ఆటో స్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్స్‌కు రోడ్డు భద్రత నిబంధనలపై ఎస్సై ఇస్లావత్ నరేష్ అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్లపై అజాగ్రత్తగా వెళ్లొద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

టేకుమట్ల-ఇందారం మధ్య క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం-టేకుమట్ల గ్రామాల మధ్య సింగరేణి సంస్థకు చెందిన భూమిలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని టేకుమట్ల గ్రామానికి చెందిన పలువురు నాయకులు కోరారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎల్‌వీ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్‌ను కలిసిన నాయకుల విజ్ఞప్తి మేరకు క్రీడా మైదానంతో పాటు ఓపన్ జిమ్ ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిపారు. అదేవిధంగా టేకుమట్ల గ్రామంలో గుడ్ల కొండయ్య ఇంటి నుండి గోదావరి వరకు రోడ్డు పనులు చేపడతామని, గ్రామస్తుల సౌలభ్యం కోసం నాలుగు బోరు బావులు ఏర్పాటు, హనుమాన్ టెంపుల్ వద్ద టాయిలెట్స్, రైతు వేదిక నుండి శ్మశాన వాటిక వరకు రోడ్డు పొడవు విద్యుత్ దీపాల ఏర్పాటుకు జీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెరిగిన సివిల్ సప్లై హమాలీ రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై హమాలి యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10న కార్మికులకు ప్రభుత్వానికి జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేస్తూ హమాలి రేట్లు పెంచాలన్నారు. అప్పటివరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్లు పెంచడానికి సంబంధించిన జీవో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు పెంచాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇతర డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, తుకారాం, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.

మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 12న నిర్వహించే మాలీ సంక్షేమ సంఘం ఎన్నికలలో పోటీ చేసేందుకు రాష్ట్ర అధ్యక్ష పదవికి కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన నికోడె రవీందర్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్‌లోని జిల్లా కోర్టులో 2001 నుండి న్యాయవాదిగా కొనసాగుతున్న నికోడె రవీందర్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల కమిటీ సభ్యుడు కావిడె దత్తుకు అందించారు. ఎన్నికలలో గెలిచిన వారు మూడేళ్ల పాటు అధికారంలో కొనసాగుతారు. ఈ సందర్భంగా నికోడె రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా తనకు అవకాశం ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా మాలి కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు ఆదె బాబూరావు, వడై గౌరయ్య, నగోసె శంకర్, ఆదె శంకర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో వందేభారత్ రైలును ఆపాలి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రికి రైల్‌యాత్రి సభ్యుల వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

హైదరాబాద్ నుండి ఢిల్లీ వెళుతున్న వందేభారత్ రైలును కాగజ్‌నగర్‌లో నిలుపాలని కోరుతూ స్థానిక రైల్‌యాత్రి సేవా సమితి సభ్యులు సోమవారం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కోరారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన సోమన్నను సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సమక్షంలో రైల్వే యాత్రి సేవా సమితి సభ్యులు ప్రయాగ్ తివారి, పవన్ బల్దేవా కలిసి వినతిపత్రం ఇచ్చారు. వందభారత్ రైలుతో పాటు తమిళనాడు, కేరళ ఎక్స్‌ప్రెస్‌లను కాగజ్‌నగర్ స్టేషన్‌లో ఆపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నియోజవర్గంలో బెంగాళీలు అధికంగా నివసిస్తున్నారని, వారి సౌకర్యార్థం హైదరాబాద్ నుండి కలకత్తాకు వయా కాగజ్‌నగర్ మీదుగా ఒక నూతన రైలును నడిపించాలని వారు కేంద్ర మంత్రిని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే హరీష్‌బాబు తెలిపారు.

కాగజ్‌నగర్ బస్టాండ్‌లో చోరీ

- రెండు తులాల బంగారు చైన్‌తో పాటు నగదు అపహరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బస్టాండ్‌లో సోమవారం చోరీ జరిగింది. స్థానిక పోచమ్మబస్తీకి చెందిన దాసారపు రమాదేవి తన కూతురు వద్దకు గోదావరిఖని వెళ్లేందుకు కాగజ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చింది. మంచిర్యాల బస్సు ఎక్కుతున్న సమయంలో ఆమె పట్టుకున్న బ్యాగులో నుండి పర్సు దొంగతనానికి గురైంది. బస్సు ఎక్కిన తర్వాత చూసుకోగా పర్సు చోరీకి గురైనట్లు తెలిసింది. ఆ పర్సులో రెండు తులాల బంగారు చైన్‌తో పాటు రూ. 2000 ఉన్నట్లు ఆమె పోలీసులకు తెలిపింది. కూతురు వద్దకు వెళ్లే హడావుడిలో ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

జాతీయస్థాయి సైకిల్ పోలో ఛాంపియషిప్‌కు ఎంపికైన విద్యార్థి

నవతెలంగాణ-తిర్యాణి

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల(బి)లో 10వ తరగతి చదువుతున్న కర్పెత నాగేశ్వర్ అనే విద్యార్థి గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఈ నెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని రానాఘాట్‌లో జరిగే జాతీయ స్థాయి సైకిల్ పోలో ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శంకర్, పాఠశాల ఉపాధ్యాయుడు జి లక్ష్మణ్ తెలిపారు. పోటీలకు విద్యార్థిని డీడీ(టీడబ్ల్యు) రమాదేవి, డీఎస్ఓ మీనారెడ్డి, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ చిరంజీవి అభినందించారు.



గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి మండలం భూదాకుర్తు గ్రామపంచాయతీలోని ఇందిరానగర్‌ను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరారు. సోమవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ జోష్ణకు వినతి పత్రం అందజేశారు. 4000 జనాభా గల బూదకుర్తు మేజర్ గ్రామపంచాయతీని విభజించి ఇందిరానగర్ ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజావాణిలో ఇంటి పన్ను గురించి ఒక దరఖాస్తు రాగా, షాప్ నంబర్-7లో అదనపు డీలర్‌ను నియమించాని ప్రజలు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామల, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, ఏపీఓ డేవిడ్, మిషన్ భగీరథ రక్షిత, వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, ఎంపీడీఓ ఆఫీస్, సూపరింటెండెంట్ వేణు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్ : జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు మీ-సేవలో నిర్ణీత తేదీలలో స్లాట్ బుక్ చేసుకుని, నూతన సర్టిఫికెట్, కాలపరిమితి పూర్తి అయిన వారు రెన్యువల్‌కు సకాలంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాలకు హాజరు కావాలని తెలిపారు. జనవరి 9, 17, 22, 30 తేదీలలో శారీరక వికలాంగులు-ఆర్థో (60), 20వ తేదీన మూగ, చెవుడు(50), 24న కంటిచూపు(25), 28న మానసిక వికలాంగులు(50)లకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకొని వెయిట్ లిస్టు నందు ముందు ఉన్న వారి మొబైల్ నెంబర్‌కు సదరం క్యాంపు రావలసిన తేది మెసేజ్ వస్తుందని, మెసేజ్ వచ్చిన వారు మాత్రమే కేటాయించిన తేదీలలో సదరం శిబిరానికి సంబంధిత పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. సదరం ధ్రువపత్రం కాలపరిమితి ముగిసి రెన్యువల్ కొరకు జనవరి 8వ తేదీన ఉదయం 11.30 గంటలకు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు

నవతెలంగాణ-లక్సెట్టిపేట

రైతుభరోసా పేరిట ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విమర్శించారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని ఏడాది పాటు ఊరించి చివరికి రూ.12 వేలు ఇస్తామని రైతుల ఉసురు పోసుకున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలకు ఇచ్చిన ప్రధాన హామీకి పాతరేసినందుకు రైతు డిక్లరేషన్ కాపీకి, గ్యారెంటీ కార్డులకు గొయ్యి తీసి బొందపెట్టే కార్యక్రమం, పిండం పెట్టే కార్యక్రమం చేపట్టాలని అన్నారు. మాయ మాటలు చెప్పి రైతన్నల ఓట్లు వేసుకొని అధికారంలోకి వచ్చినాక మోసం చేసిన కాంగ్రెస్ నాయకులను, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ఇచ్చిన రైతుబంధును బిచ్చమేస్తున్నారు అంటూ విమర్శించిన కాంగ్రెస్ ఇప్పుడు రూ.వెయ్యి పెంచి రైతన్నను అవమానించడమే అన్నారు. మా ప్రభుత్వం రైతుబంధు రూ.72 వేలకోట్లు, రైతు రుణమాఫీ రూ.27 వేల కోట్లు మొత్తంగా లక్ష కోట్లను రైతన్నల ఖాతాల్లోకి జమచేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్, పట్టణ మండల అధ్యక్షులు పాదం శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, మండల యూత్ అధ్యక్షుడు అంకతి గంగాధర్, మైనార్టీ అధ్యక్షుడు చాంద్, దండేపల్లి మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ పాల్గొన్నారు.



లక్సెట్టిపేట పట్టణంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



జైపూర్‌లో..

జైపూర్ : అబద్ధపు ప్రకటనలతో తెలంగాణ రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి తప్పును ఒప్పుకుని ముక్కు భూమికి రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం చెన్నూర్ పట్టణంలో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతు భరోసా రూ.15 వేల చొప్పున ఆర్థిక తోడ్పాటు అందిస్తామని ప్రకటించి ఇప్పుడు క్యాబినేట్ సమావేశంలో రూ. 12 వేల చొప్పున ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. కాంగ్రెస్ భవిష్యత్తులో మనుగడ లేకుండా పోతుందని, ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం బాగిపడలేదని అన్నారు. రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భయపడరని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎకరాకు రూ.15 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, నవాజూద్దీన్, కృష్ణ, సాంబగౌడ్, రేవెల్లి మహేష్, అనిల్ పాల్గొన్నారు.

జైపూర్‌లో...

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపు మేరకు జైపూర్ మండల పరిధి బీఆర్ఎస్ నాయకులు సోమవారం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై బైటాయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్‌తో పాటు మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం : ఎన్నికలకు ముందు రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరానికి రూ.15000 పెట్టుడి సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రూ.12000 ఇస్తామనటం హాస్యాస్పదమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోనీ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందే మాయ మాటలతోనే అన్నారు. ఇచ్చిన 6 గ్యారెంటీ స్కీములు అమలు చేయడంలో విఫలం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు బే షరతుగా ప్రతి రైతుకు రూ.15000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సులువా జనార్ధన్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల్ల భరత్ కుమార్, ఫజల్ ఖాన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, బోర్లకుంట ప్రభుదాస్ జంగం రవి, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, రాగుల శంకర్, ఒల్లాల నరసాగౌడ్, రాములు నాయక్, జునుగురి మల్లయ్య, రాకేష్, భరత్ నాయక్, కె ప్రభుదాస్, లెక్కల మల్లయ్య, శ్రీరామ్ శ్రీధర్, రామన్న పాల్గొన్నారు.



జన్నారంలో..

మహేంద్ర సంఘం యూత్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కామన్ పెల్లి, దేవునిగూడ కిష్టాపూర్ గ్రామాల మహేంద్ర యూత్ కమిటీని సోమవారం యోజన సంఘం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కోడిజుట్టు నరేష్, అధ్యక్షులుగా ఒడిపల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కోరుట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఒడిపల్లి అంజయ్య, కోశాధికారిగా ఒడిపెల్లి రాజన్న(బాపు), ప్రచారకార్యదర్శిగా మదిరే నవీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ యువజన సంఘం నాయకులు ఎన్నికైన సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఎస్టీయూటీఎస్ క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ-నస్పూర్

ఎస్టీయూటీఎస్ నూతన క్యాలండర్‌ను సోమవారం జిల్లా విద్యాధికారి యాదయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వి పద్మ కె మహాలక్ష్మి, బి మన్మోహన్, మండల అధ్యక్షుడు మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ అసోసియేట్ అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మండలానికి చెందిన అనుముల రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొట్టే శంకర్ తెలిపారు. సోమవారం ఆ సంఘం మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని సంఘ భవనంలో మండల శాఖ అధ్యక్షులు కట్ట రాజమౌళీ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం నూతన డైరీ క్యాలెండర్‌ను లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకితభావంతో పనిచేస్తూ పదో తరగతిలో చక్కటి ఫలితాలు సాధించాలని అదేవిధంగా ఉపాధ్యాయులు నూతన సంవత్సరంలో మంచి ఆరోగ్యంగా ఉండాలంటే చెడు అలవాట్లు విడి ఆరోగ్యకరమైన ఆహారం రోజువారి వ్యాయామము ముఖ్యంగా కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలన్నారు. దానిలో చక్కర స్థాయి అధికంగా ఉండడం వల్ల డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి అందరు కూడా ఈ నూతన సంవత్సరంలో కూల్ డ్రింక్స్ వాడకూడదని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘంపట్ల నిరంతరం అంకితభావంతో, సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్నా అనుమల రాజన్నని మండల అధ్యక్షులు కట్ట రాజమౌళి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా అనుమల రాజన్న, ఏకగ్రీవ ఎన్నుకొని మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు కొండ జనార్ధన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్ విజయకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిట్టల రాజారావు, అప్పలమనోహర్, పెట్టం తిరుపతి, నెమలికొండ ప్రభాకర్ గాజుల చంద్రశేఖర్, జాజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమలికొండ కాంతయ్య, బానోతు ప్రభాకర్, దండేపల్లి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లేష్, ఆర్ రవి మండల ప్రధాన కార్యదర్శి నగూర్ సత్యనారాయణ పాల్గొన్నారు

అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



లక్సెట్టిపేటలో..

నవతెలంగాణ-లక్సెట్టి పేట

అంగన్‌వాడీలకు అందాల్సిన అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ లక్సెట్టిపేట ప్రాజెక్టు సీడీపీఓ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఐసీడీఎస్ అధికారులు ప్రతిరోజు జీపీఎస్ ద్వారా ఫోటోలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫోన్లు ఇచ్చి 6 సంవత్సరాలు గడిచిందని అవి ఇప్పుడు పనిచేయడం లేదని అన్నారు. ప్రతిరోజు రెండు యాప్‌లు, రిజిస్టర్లు రాయడం ప్రభుత్వం ఇచ్చే ప్రతి సర్వే చేయిస్తున్నారని అన్నారు. జాతీయా నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించినఉద్యోగులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుష్పలత, పద్మ సువర్ణ, ఉమాదేవి, సుజాత, నర్సమ్మ, రాధా పాల్గొన్నారు.

తాండూర్ : సీఐటీయూ అనుబంధ సంఘం అంగన్‌వాడీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు భానుమతి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రమణ, నాయకులు గుమాస అశోక్, అనురాధ జిల్లా కమిటీ సభ్యురాలు పద్మ పాల్గొన్నారు.

జైపూర్ : అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు అన్నీ అమలు చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు ఆలిండియా అంగన్‌వాడీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చెన్నూర్ పట్టణంలో సోమవారం సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సంధర్భంగా సీఐటీయూ నాయకురాలు విజయ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదే పదే గుడ్ న్యూస్ అంటూ అంగన్వాడీలను మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బోడంకి చందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని విమ్మర్శించారు. ఈ కార్యక్రమంలో శారద, గూజర్, ప్రవీణ, విజయలక్ష్మి, అమృత, పుష్ప, మహాతి, కరీంబీ హైదర్ బాను, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



తాండూర్‌లో..

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-తాండూర్

అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్టీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) జిల్లా సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీలలో బండారి చిరంజీవి హాల్, హంటర్ రోడ్, హన్మకొండలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వార్షిక క్రీడల బహుమతులు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

వర్క్స్ పీపుల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ శ్రీరాంపూర్ ఏరియా 2024-25 వార్షిక క్రీడల బహుమతులను సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ అందజేశారు. శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం పర్సనల్ అరవింద రావు అద్యక్షతన ప్రగతి మైదానంలో గల సీఈఆర్ క్లబ్‌లో వివిధ క్రీడాంశాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ క్రీడలలో పాల్గొని, సింగరేణి వ్యాప్తంగా నిర్వహించే పోటీలలో అలాగే కోలిండియా ఆటల పోటీలలో పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయమని కొనియాడారు. అలాగే క్రికెట్, ఫుట్బాల్, వాలి బాల్ కంపెనీ స్థాయిలో గెలిచినందుకు అభినందించారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగులు క్రీడలలో పాల్గొనడానికి కావలసిన అన్ని సదుపాయాలను శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకొని వివిధ పోటీలలో గెలుపొందు తున్నారని గెలుపొందిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కోల్ ఇండియా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన అజయ్(55 కేజీల బాడీ బిల్డింగ్), బ్రాంజ్ మెడల్ సాధించిన ఈశ్వర చారి, వెంకటేశ్వరరావు (టేబుల్ టెన్నిస్ డబుల్స్)ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, సీనియర్ పీఓ పి కాంతారావు, స్పోర్ట్స్ హానరరీ సెక్రటరీ పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, జీఎం చర్చల కమిటీ సభ్యులు చంద్రమోహన్, భద్రి బుచ్చయ్య స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసయ్య ఇండోర్ కెప్టెన్ తోట సురేష్ పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ ఆవరణలో ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామపంచాయతీలోని వీరాంజనేయ గ్రామ సంఘం-రాజరాజేశ్వరి చిన్న సంఘం సభ్యురాలు సుద్దాల విజయ పొందిన సంచార చేపల విక్రయ వాహనాన్ని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ అంశాలలో స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. చేపల విక్రయ వాహనంలో తాజా చేపలు, అన్ని రకాల రుచికరమైన ఫిష్ ఫ్రై లభిస్తాయని తెలిపారు. లబ్ధిదారులకు కేటాయించిన రూ.10 లక్షల ప్రాజెక్టు విలువలో రూ.4 లక్షల సభ్యురాలి వాటాధనం, రూ.6 లక్షల ప్రభుత్వ రాయితీ ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన పొందాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని రకాల శిక్షణ అందిస్తామని, మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ వాహనం ద్వారా చేపలు పొందేందుకు 7416639967 నెంబర్‌లో సంప్రదించవచ్చని, ప్రజలు ఈ వాహనాన్ని వినియోగించుకొని లబ్ధిదారులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ నిర్మించాలి



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలికల వసతి గృహానికి వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ ఎస్సీ బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థినిలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, దానివల్ల అసాంఘిక కార్యక్రమాలు జరిగే అవకాశం కూడా ఉందని అన్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి ఎస్సీ బాలికల వసతి గృహానికి ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 29 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పాన్ కార్డ్‌తో ఆధార్ అనుసంధానం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

పాన్ కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేయాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్కమ్ టాక్స్ ఫైలింగ్ చేయని సింగరేణి ఉద్యోగులు వారి ఇన్కమ్ టాక్స్ ఫైలింగ్ చేసుకొనుటకు డిసెంబర్ 31 వరకు గతంలో గడువు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ గడువు జనవరి 15 వరకు ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ వారు పొడిగించడం జరిగిందని తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని పాక్‌పట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. శనివారం నిర్మల్‌లోని దివ్య గార్డెన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పోటీల్లో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను సోమవారం అభినందించారు. తోటి విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే డీఎస్సీలో ఖాళీలను చూపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాబోయే డీఎస్సీ-2025కు సంబంధించి ఆదిలాబాద్ జిల్లాలో గల ఉపాధ్యాయ ఖాళీలను అన్ని పోస్టులను నోటిఫికేషన్‌లో పూర్తిగా చూపించాలని ఆదిలాబాద్ డీఎస్సీ అభ్యర్థులు కోరారు. సోమవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. 2024 డీఎస్సీలో జిల్లాలో ఉన్న అన్ని ఖాళీలను చూపించకపోవడంతో జిల్లాలోని నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. వచ్చే డీఎస్సీలో నిరుద్యోగులకు నష్టం కాకుండా ఖాళీలను చూపించాలని కోరారు. దీనికి డీఈఓ సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. డీఈఓను కలిసిన వారిలో అభ్యర్థులు వెంకటేష్, ప్రదీప్, విజయ్, విక్రమ్, శివ ఉన్నారు.



పెంచిన రేట్ల జీఓను విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హమాలీలకు పెంచిన రేట్ల జీఓను విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం సమ్మెలో భాగంగా ఆరో రోజు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సివిల్ సప్లరు కమిషనర్ చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ కార్మికులకు పెంచిన రెట్ల జీఓను అమలు చేయాలన్నారు. ఒప్పందాలు చేసుకొని వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం క్వింటాళుకు రూ.22 నుంచి రూ. నాలుగు పెంచి రూ.26 ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు మళ్లీ రేట్లను పెంచి రూ.30 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.29 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు రెట్లను పెంచడం జరుగుతుందన్నారు. కమిషనర్ కూడా ఈ విషయమై ఒప్పందం చేసుకొని ఆరు నెలలవుతున్న జీఓను మాత్రం విడుదల చేయడం లేదన్నారు. జీవో వచ్చే వరకు తమ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, హామాలీ యూనియన్ నాయకులు సలీం, మోసిన్, రాజేందర్, రమేష్, పొచ్చన్న ఉన్నారు.

నిర్మల్‌టౌన్ : సివిల్ సప్లై హమాలీ కూలి రేట్ల ఒప్పంద జీఓ జారీ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఎస్.విలాస్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌యన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పాల్గొని, మాట్లాడారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సబ్ సెంటర్ పరిధిలో ఉన్న గర్భిణులకు వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సీహెచ్‌ఓ లక్ష్మీ హెచ్‌ఈఓ రాథోడ్ తులసిదాస్, పీహెచ్‌ఎన్‌ఓ సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, గణేష్ కుమారి, వైద్య సిబ్బంది ఆడే శ్యామక, రవీందర్, విజయలక్ష్మి, కవిత, ఆశాలు సున్నా, రుక్మాబాయి, అరుణ, పూల, వందన, మారుబాయి, 102 పైలట్ రాజు ఉన్నారు.

ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నర్సింహాస్వామి అన్నారు. సోమవారం సీపీఓ అధికారిని కలిసి విన్నవించారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు.

రైట్ టూ హెల్త్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా రమేష్ గౌడ్



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని పౌనూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేష్ గౌడ్ రైట్ టూ హెల్త్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రైట్ టూ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేడ్ల శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం నియమాక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి రమేష్ గౌడ్ మాట్లాడుతూ నాపట్ల గల నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాజారమేష్



నవతెలంగాణ-జైపూర్

మండలం ముదిగుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆకుల రవి కుటుంబ సభ్యులను స్థానిక నాయకులతో కలిసి బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజారమేష్ పరామర్శించారు. ఆకుల రవి నానమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను కలిసి మృతి చెందిన ఆకుల గౌరమ్మ చిత్రపటానికి నివాళ్ళు అర్పించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత
- ఘనంగా ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఉట్నూర్


అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సునీత అన్నారు. సోమవారం ఉట్నూర్‌లో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. ఐసీడీఎస్ పథకంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పని చేస్తున్నారని అన్నారు. యూనియన్ల పోరాటం వల్లే తమకు యూనిఫామ్, పారితోషికం లభిస్తుందన్నారు. నేటికీ ఈ పథకం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని గుర్తు చేశారు. ఈ పథకంలో ఎన్నో కోట్ల మంది ఆరు సంవత్సరాలలోపు పిల్లలు, రెండు కోట్ల తల్లులు లబ్ది పొందుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేసి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ల జిల్లా కోశాధికారి



రత్నమాల, ప్రాజెక్ట్ కార్యదర్శి ముక్త, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు సుభద్ర, పార్వతి, సుజాత, పద్మ, కళావతి, రేణుక, అంబు భాయి, స్వర్ణలత, విజయ పాల్గొన్నారు.

గణిత శాస్త్రవేత్తలకు మార్గదర్శి రామానుజన్

- వి.నరేందర్‌రెడ్డి
- అల్ఫోర్స్ మ్యాథ్ ఒలంపియాడ్ టెస్ట్ టాపర్స్‌కి సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యార్థులు గణిత శాస్త్రం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చుని, గణితంలో నైపుణ్యం పొందిన వారు ఏ పోటీపరీక్షల్లోనైనా సులభంగా విజయం సాధించగలుగుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆదర్శనగర్‌లోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యా సంస్థల వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి అల్ఫోర్స్ గణిత మ్యాథ్ ఒలంపియాడ్ టెస్ట్‌లో రాణించిన నిర్మల్ ప్రాంత విద్యార్థులకు నిర్వహించినటువంటి ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు రామానుజన్ అద్భుతాలు సృష్టించి యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షింపజేసి ప్రత్యేక స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, చారిత్రాత్మకమని ఇతర గణిత శాస్త్రవేత్తలకు మార్గదర్శకమని తెలిపారు. బాల్యంలోనే గణితంలో అద్భుతాలు సృష్టించవచ్చని తన మేధస్సుతో నిరూపించినటువంటి గొప్ప గణిత శాస్త్రవేత్త మన భారత దేశంలో జన్మించడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. రామానుజన్ స్మారకార్థం అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆరంభం నుంచి నిర్వహిస్తున్నటువంటి అల్ఫోర్స్ మ్యాథ్ ఒలంపియాడ్ టెస్టులో ఈ సంవత్సరం సైతం వివిధ ప్రాంతాల విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా పరీక్ష నిర్వహించి, అందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రాంతాలవారీగా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రామానుజన్ విశిష్టతను తెలియజేసే అటువంటి ప్రదర్శించిన నృత్యాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పని దినాలు కల్పించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బీడీ కార్మికులకు 26 రోజుల పని దినాలు కల్పించాలని నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో బీడీలు చుడుతూ మహిళలు జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. కానీ శివాజీ బీడీ యాజమాన్యం కేవలం నెలకు 10 రోజులు మాత్రమే పని దినాలు కల్పిస్తున్నారని, వెంటనే 26 రోజుల పని కల్పించాలని అన్నారు. జిల్లాలో ఒకే బీడీ యజమాని రెండు రకాలుగా పని దినాలు ఇస్తుంటే కార్మికులు గందరగోళానికి గురి అవుతున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. పని కల్పించని యెడల బీడీ, చుట్టు కార్మికుల చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేవలం పది రోజులు పని మాత్రం దొరకడంతో పని లేక కార్మికులు ఆర్థికంగా నష్టపోతూ, కుటుంబాల జీవనం గడవడం కష్టంగా మారిందని అన్నారు. జిల్లాలో శివాజీ బీడీ యాజమాన్యం దాదాపు 25 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారని కార్మికులందరికీ సమాన పని 26 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జిల్లా నాయకులు కే.లక్ష్మి, సుజాత, లావణ్య, సునీత, రమేష్, గంగాధర్, గజ్జరాం, ముత్యం, సత్యం, గంగాధర్, సాగర్ పాల్గొన్నారు.



సమగ్ర ఉద్యోగుల పోరాటం న్యాయమైంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయమైన డిమాండ్ల కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు పోరాటం న్యాయమైందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రాల నగేష్ అన్నారు. సమ్మెను నిర్వీర్యం చేసేలా ఉద్యోగులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తుందని, ఎలాంటి ఆందోళన చెందవద్దని ఆయన ఉద్యగులకు భరోసా కల్పించారు. కలెక్టర్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనపై ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. ఉద్యోగులను తొలగించిన చరిత్ర ఇప్పటివరకు జరగలేదని, ఒకవేళ అలాంటి ప్రయత్నం చేస్తే తమ బార్ అసోసియేషన్ అండగా నిలుస్తుందని అన్నారు. అవసరమైతే ఉచితంగా న్యాయపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జా నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, నాయకులు రాము, సంతోష్, రాజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, ప్రియాంక, పార్థసారథి, మల్లికా, భోజన్న, దీప్తి, ధరమ్‌సింగ్, కేశవ్, దేవదర్శన్, చిరంజీవి పాల్గొన్నారు.

సీసీఐ ఇష్టారాజ్యం పట్టించుకోని మార్కెట్ అధికారులు

నవతెలంగాణ-నేరడిగొండ

పత్తి పంట మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, నేరడిగొండ మండలాల రైతులకు సీసీఐ అధికారుల ఏకపక్ష నిర్ణయాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీసీఐ నిర్ణయాలకు మార్కెట్ అధికారులు వత్తాసు పలకడంతో బోథ్, నేరడిగొండ మండలాల్లోని రైతులు అడుగడుగునా నష్టపోతున్నారన్నారు. సీసీఐ అధికారులు ఆదిలాబాద్‌లో ఒక ధర బోథ్, నేరడిగొండ మండలాల్లో ఒక ధర పెట్టి పత్తి కొనుగోలు చేస్తున్నారని, పత్తి నాణ్యత పేరిట కొర్రీలు పెట్టి మెక్‌మోడ్‌ను ప్రారంభించడానికి నడుంబిగించిందన్నారు. మొదటి కోతలో తేమ శాతం ఎక్కువగా వస్తుందని అంటున్న సీసీఐ రైతులకు సరైన మద్దతు ధరతో కొనుగోలు చేయలేదని దుయ్యబట్టారు. రెండవ కోతలో 8 కంటే తక్కువ తేమ శాతం నమోదైన రైతులకు ఎందుకు బోనస్ ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతుల పక్షాన బీజేపీ నిలబడుతుందని, వెంటనే మద్దతు ధర రూ.7,521తో బోథ్, నేరడిగొండ మండలాల పరిధిలో గల జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోలు చేపట్టాలని, లేని యెడల రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ విడుదల



నవతెలంగాణ-తాండూర్

పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సంబరం శ్రీనివాస్, మదుసూదన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం అర్హుల జాబితాలో అవకతవకలు



నవతెలంగాణ-మందమర్రి

డబుల్ బెడ్రూం అర్హుల జాబితాలో అవకతవకలు జరిగినట్లు జాతీయ మానవ హక్కుల మండలి జిల్లా జనరల్ సెక్రటరీ టి రాజశేఖర్ తహసీల్దార్ సతీష్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. అధికార పార్టీ వార్డు ఇన్‌చార్జ్‌లు సర్వే చేశారని, సొంత ఆస్తులు, భూములు, ఇండ్లను కలిగి ఉన్న వారిని కూడా జాబితాలో చేర్చినట్లు లేఖలో పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులతో పారదర్శకంగా రీవెరిఫికేషన్ చేయించి ఇండ్లు లేని నిరుపేదలకి న్యాయం చేయాలని కోరారు.

గురుకులలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

2025-26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఐదవ తరగతి, ఆరవ తరగతి నుంచి 9వ తరగతి వరకు గల బ్యాక్లాగ్ ఖాళీలను ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లు కలిగించడానికి నోటిఫికేషన్ ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ కె రమా కళ్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 1 లోపు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



నవతెలంగాణ-జైపూర్

మండల స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీలతో పాటు ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్ అభినందించారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో రెండు రోజుల క్రితం నిర్వహించిన పోటీల్లో జీ అశ్విత, జశ్విత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అశ్వితను జిల్లా ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య రూ.5 వందలు నగదు బహుమతి అందజేస్తూ జిల్లా స్థాయిలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పోత్సహించారు. ఈ నెల 18న జిల్లా స్థాయిలో నిర్వహించి పోటీల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రంలో జిల్లా సమన్వయకర్త యశోద, మండల కన్వీనర్ వనజాకుమారి, ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, ఉపాధ్యాయులు క్రీస్తు కుమారి పాల్గొన్నారు..

పాఠశాలకు చేరిన విద్యార్థులు



నవతెలంగాణ-జైపూర్

ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ఆర్కే-7 ఏరియాకు చెందిన ఇద్దరు విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించారు. జైపూర్ అదనపు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇందిరాతో కలిసి పాఠశాల తరగతులకు హాజరు కాకుండా తిరుగుతున్న విద్యార్థులను సోమవారం గుర్తించారు. 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలో చేరాల్సిన విద్యార్థులు పిట్టల జాన్ వెస్లీ, పిట్టల దీపికలు తరగతి గదులకు హాజరు కావడం లేదని తెల్సి విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను కలిశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపిన అధికారులు జిల్లా పరిషత్ జైపూర్ పాఠశాలలో చేర్పించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ వసతీ గృహం వార్డెన్‌తో మాట్లాడి విద్యార్థులు పట్ల శ్రద్ధ చూపి రెగ్యూలర్‌గా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జగన్ మోహన్ గౌడ్, గోవింద్, భాస్కర్, మహేష్, భాస్కర్ గౌడ్, మనీషా పాల్గొన్నారు.